క్లుప్తంగా

పేస్‌లో కుష్టు పరీక్షలు

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎల్‌సీడీసీ ప్రోగ్రాంలో భాగంగా టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి డాక్టర్ ప్రసాద్, డాక్టర్ అశోక్, హెల్త్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో లెప్రసీ స్క్రీనింగ్ టెస్టును విద్యార్థులకు నిర్వహించారు. చర్మంపై మచ్చలు కనిపిస్తే క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

సాగర్ జలాలు విడుదల చేయాలి

ఒంగోలు టౌన్: జిల్లా ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం వెంటనే సాగర్ నీటిని విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన జిల్లా కార్యదర్శివర్గ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో తాగునీటి అవసరాల కోసం రామతీర్థంతో పాటు 28 మంచినీటి పథకాలు అందుబాలో ఉన్నాయన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు పరిధిలో 34 చెరువులు, సాగర్ కింద 98 చెరువులు ఉండగా వాటికి జూన్ చివరికి నీరు వదలాల్సి ఉందని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలోని మంచినీటి చెరువులన్నీ అడుగంటి పోయాయని, సాగర్ నీటి మీద ఆధారపడిన స్కీములు, చెరువుల ద్వారా మంచినీరు పొందే ప్రజలకు తాగునీటి కొరత ఏర్పడుతుందని చెప్పారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని తక్షణమే సాగర్ జలాలలను విడుదల చేయాలని కోరారు. సమావేశానికి సీనియర్ నాయకులు జీవీ కొండారెడ్డి అధ్యక్షత వహించగా షేక్ మహబూబ్, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, ఎం.రమేష్, డి.సోమయ్య, ఉసా వెంకటేశ్వర్లు, వి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న మోటారు బైకు


ప్రమాదంలో గాయపడిన యువకులు

ఒంగోలు టౌన్: వేగంగా వెళుతున్న మోటారు బైకు అదుపు తప్పి ముందు వెళుతున్న ఆటోను ఢీకొనడంతో ఇద్దరు యువకులకు గాయలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. ఒంగోలు నుంచి కావలి వెళుతున్న మోటారు బైకు పెళ్లూరు అంబేడ్కర్ కాలనీ సమీపంలో చెక్క లోడు వేసుకొని వెళుతున్న ఆటోను వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మోటారు బైకును నడుపుతున్న ఒంగోలుకు చెందిన సురేంద్ర, త్రోవగుంటకు చెందిన రాయపాటి వర్ధన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. 108లో వీరిని వెంటనే రిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలల్లో లైఫ్ కార్యక్రమాల అమలు



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న డీవైఈఓ చంద్రమౌళీశ్వరరావు

మార్కాపురం: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని పాఠశాలల్లో లైఫ్(లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు డీవైఈఓ చంద్రమౌళీశ్వరరావు తెలిపారు. గురువారం మార్కాపురంలోని ఆయన కార్యాలయంలో లైఫ్ బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో పర్యావరణ అంశాలపై అవగాహన సదస్సులు, ర్యాలీలు తదితర కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఏపీఎస్‌జీసీ తరపున కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ ఎం.సజీవరాజు, మార్కాపురం క్లస్టర్ కోఆర్డినేటర్ ఒద్దుల రవిశేఖర్‌రెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన 75 అంశాలను పాఠశాలలు అనుసరించాలని తెలిపారు. ఎంఈఓ–2 శ్రీనివాసులు మాట్లాడుతూ.. విద్యుత్, నీటి ఆదా, ఏకకాలంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వ్యర్థాలను తగ్గించడం, ఆరోగ్యవంతమైన జీవనశైలిని ఏర్పాటు చేసుకోవడం తదితర పర్యావరణ అంశాలను పాటించాలని తెలిపారు. ఎస్టీయూ నాయకుడు ఎర్రయ్య పాల్గొన్నారు.

ప్రతి లబ్ధిదారుని కోసమే జగనన్న సురక్ష

- రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు
- రూ.2 కోట్లతో తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి ఆమోదం
- మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే టీజేఆర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు

చీమకుర్తి: సంక్షేమ పథకాలను పొందటంలో ఏ ఒక్క లబ్ధిదారుడు కూడా మిస్ కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు తెలిపారు. గురువారం చీమకుర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలను పొందటంలో అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను అందజేయడంలో చీమకుర్తి మండలం అగ్రస్థానంలో ఉందన్నారు. ఇప్పటికే చీమకుర్తి రూరల్ పరిధిలో 22 వేలు, అర్బన్‌లో 6 వేలు, నియోజకవర్గం మొత్తం మీద 56 వేల సరిఫికెట్లను అందించిన ఘనత అధికారులకే దక్కుతుందని ప్రశంసించారు. తొలుత మండల పరిషత్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను సర్వసభ్య సమావేశం చర్చించి ఆమోదించింది. ఆమోదించిన ప్రధాన అంశాల్లో చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయాన్ని రూ.2 కోట్ల వ్యయంతో నూతన భవనాన్ని నిర్మించేందుకు సభ్యులు ఏమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఆమోదించారు. దానితో పాటు ఇప్పటి వరకు మండలంలో రూ.32 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. మరో రూ.10 కోట్లతో చేస్తున్న అభివృద్ధి పనులను ఆమోదించారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో కరెంటు స్తంభాలు, ఇతర సమస్యల పరిష్కారానికి మండల పరిషత్ నిధులు రూ.1.32 కోట్లను పంచాయతీల అకౌంట్లలోకి బదిలీ చేసినట్లు ఈ సందర్భంగా తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మరమ్మతులు, ఇతర మౌలిక వసతులను కల్పించేందుకు అవసరమైన నిధులను ఎస్టిమేషన్ వేసి ఐసీడీఎస్ అధికారులు మండల పరిషత్‌కు అందిస్తే వాటికి కావాల్సిన నిధులను కూడా అందించేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. తాగునీటి సమస్యలు రాకుండా ఎక్కడెక్కడ బోర్లు అవసరమో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గుర్తించి నివేదిక ఇస్తే వెంటనే బోర్లు ఏర్పాటు చేసేందుకు పాలకవర్గం సభ్యులు ఆమోదం తెలిపారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.రాఘవేంద్ర, తహసీల్దార్ పి.మధుసూదన్‌రావు, పలు గ్రామాల నుంచి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు సహకరించండి


రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు

ఒంగోలు అర్బన్: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని ఆ దిశగా రాజకీయ పార్టీలు సహకరించాలని ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు అన్నారు. గురువారం తన కార్యాలయంలో స్పెషల్ సమ్మరీ విజన్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21 వరకు బీఎల్‌ఓలు ఇంటింటి ఓటర్ లిస్టు సర్వే చేస్తారన్నారు. జనవరి 1వ తేది 2024 నాటికి 18 ఏళ్లు నిండిన వారందరికి ఓటు హక్కు కల్పించాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు ప్రక్రియకు ప్రతి సహకరించాలని కోరారు. ఎలక్షన్ డీటీ రఫీ, శ్రీదేవి, రాజకీయ పార్టీల ప్రతినిధులు దామరాజు క్రాంతికుమార్, స్వరూప్, రాజశేఖర్, అజయ్, సత్యం, రసూల్, రమేష్, రవీంద్ర, వెంకటస్వామి తదితరలు పాల్గొన్నారు.

పిడూరి సేవలు మరువలేనివి


పిడూరి వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న అధికారులు

ఒంగోలు సబర్బన్: రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ పిడూరి వెంకటేశ్వరరావు సేవలు పోస్టల్ విభాగంలో మరువలేనివని విజయవాడ పోస్ట్‌మాస్టర్ జనరల్ డీవీఎస్ ఆర్ మూర్తి చెప్పారు. స్థానిక ఒంగోలు హెడ్ పోస్టాఫీసులో గురువారం పిడూరి వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. పోస్ట్‌మాస్టర్‌గా పిడూరి తన బహుముఖ ప్రజ్ఞతో డిపార్ట్‌మెంట్‌లో దాదాపు 40కి పైగా అవార్డులు పొందారని కొనియాడారు. పిడూరిని దుశ్శాలువాలతో ఉన్నతాధికారులు, సహచర అధికారులు, సిబ్బంది, పోస్టల్ యూనియన్ల నాయకులు సత్కరించారు. పోస్టల్ ఏఎస్‌పీ మధుసూదన్ రావు, ఒంగోలు హెడ్ పోస్ట్ మాస్టర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

గిరిజనుడిపై దాడి చేసిన వ్యక్తిని శిక్షించాలి


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న దళిత సంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: గిరిజన యువకుడు మోటా నవీన్‌పై దాడి చేసి పైశాచికంగా మూత్రం పోసిన మన్నెం రామాంజనేయ చౌదరిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని జయప్రకాష్ కాలనీలో నివశిస్తున్న బాధితుడు మోటా నవీన్ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. అగ్రకుల దురహంకారంతో గిరిజన యుకుడి మీద మూత్రం పోసిన మన్నెం రామాంజనేయ చౌదరి ఇంటిని బుల్డోజర్‌తో కూల్చేయాలని ఎంఎస్పీ ప్రకాశం జిల్లా కన్వీనర్ తోరటి ఆనంద్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, బాధితుడికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు ఎక్స్‌గ్రేషియా, వ్యవసాయ భూమి, ఇంటి స్థలాన్ని ఇవ్వాలని కోరారు. ప్రకాశం జిల్లా ఇన్‌చార్జి చిలకా కిరణ్, కబుడంగుంట్ల లక్ష్మీనరసయ్య, జలదంకి నరసింగరావు, పాలడుగు రమేష్, కాంతారావు, టి.బాబు, కోటయ్య, టి.వెంకటేశ్వర్లు, రాజు, సుధీర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉండాలి

మోటా నవీన్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలబడాలని సోషల్ డెమోక్రాటిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు ఎంఏ సత్తార్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. సభ్య సమాజం తలదించుకునేలా సాటి మనిషిపై మూత్రం పోసిన రామాంజనేయ చౌదరితో పాటు మిగతా నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పోలీసులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సంఘటన తెలుసుకున్న వెంటనే బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి భరోసా కల్పించిన ఎస్టీ కమిషన్ సభ్యులు వడితే శంకర్ నాయక్‌కు ధన్యవాదాలు తెలిపారు.

బీసీ ఉద్యోగులను సస్పెండ్ చేయడం అన్యాయం

ఒంగోలు: ఉపాధ్యాయుల బదిలీల్లో జరిగిన అవినీతి, అక్రమాలకు బాధ్యులుగా బీసీ సామాజిక వర్గ అధికారిని, ఉద్యోగిని, ఉపాధ్యాయుడ్ని సస్పెండ్ చేయడం అన్యాయం అని బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాటికలపూడి జయరామ్ గురువారం ఓ ప్రకటనలో అన్నారు. జెడ్పీ హైస్కూల్స్ స్కూల్ అసిస్టెంట్లు గని వెంకటేశ్వర్లు, వేమూరి మాల్యాద్రిలు బదిలీలకు సంబంధించి ఐటీ సెల్ బాధ్యుడైన ఏఎస్‌వోకు సంబంధం ఉన్న.. విధి నిర్వహణలో తప్పు జరిగితే ఏడీ, సూపరింటెండెంట్‌లు ఎలా బాధ్యులు అవుతారో ఆర్.జె.డి సమాధానం చెప్పాలన్నారు. ఏఎస్‌వో జంపని కృష్ణకుమార్ వీరికోసం రెండు పోస్టులను బదిలీల జాబితాలో చేర్చకుండా డీఈవోతో మాట్లాడి జేడీ రామలింగం అనుమతితో రెండు వేకెన్సీలను ఆన్‌లైన్‌లో చూపించలేదని చెప్పి వెంకటేశ్వర్లు, మాల్యాద్రిలను తప్పుడు పత్రాలతో బదిలీచేశారన్నారు. కనుక ఏఎస్‌వో జంపన కృష్ణకుమార్, ఉపాధ్యాయులు గని వెంకటేశ్వర్లు, వేమూరి మాల్యాద్రిల కాల్ డేటాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బదిలీ ఉత్తర్వులను డౌన్‌లోడ్ చేసి , ఆ ఉత్తర్వులపై పేర్లు మార్చి , ఆ పేర్ల స్థానంలో వెంకటేశ్వర్లు, మాల్యాద్రిల పేరు రాసి ఫోర్జరీ బదిలీ పత్రాలు ఇచ్చారని, ఐటీ సెల్‌లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న గిరి ఒక్కడినే సస్పెండ్‌చే యడం సరికాదని, ఏఎస్‌వో తప్పులు ఆర్.జె.డికి కనిపించకపోవడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ఏఎస్‌వో జంపన కృష్ణకుమార్‌ను కూడా సస్పెండ్ చేసేంతవరకు, బీసీ ఉద్యోగులపై సస్పెన్షన్ ఎత్తివేసే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు.

పెళ్లి విషయంలో పరస్పరం కేసులు

ఒంగోలు టౌన్: మా అబ్బాయిని పెళ్లి చేసుకోమంటూ ఒత్తిడి చేస్తున్నారని ఒకరు, గుళ్లో పెళ్లి చేసుకొని ఇప్పుడు తన భర్త తనను వెళ్లి పొమ్మని ఒత్తిడి చేస్తున్నాడని ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగరంలోని విజయ్‌నగర్‌కు చెందిన ఐదుపోగుల నాగమల్లికి ఇద్దరు కుమారైలు, కుమారుడు సుభాస్కర్ బీటెక్ చదువుకొని గుళ్లపల్లి గ్రోత్ సెంటర్లో ఉద్యోగం చేస్తున్నాడు. అతడికి బీపీఏఎస్‌కేఆర్ కాలేజీ సమీపంలోని వడవల్లి సరస్వతి అనే అమ్మాయితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో తనను పెళ్లి చేసుకోమంటూ సదరు యువతి ఒత్తిడికి గురి చేస్తోంది. అంతే కాకుండా సరస్వతి తల్లి దండ్రులు తమ ఇంటి మీదకు వచ్చి గొడవ చేయడమే కాకుండా కులం పేరుతో దూషిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అతనిపై..

ఇదిలా ఉంగా నగరంలోని గాంధీపార్క్ ఎదురుగా వున్న గుడిలో జూలై 1న తాను, భాస్కర్ ఇష్టపడి పెళ్లి చేసుకున్నామని వడపల్లి సరస్వతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే తనను ఇంటికి తీసుకెళ్లి రెండు రోజుల పాటు ఉంచాడని, తరువాత తన అత్తమామల ఒత్తిడితో తనను దూరంగా పెట్టడమే కాకుండా వేరే పెళ్లి చేసుకోమంటూ చెబుతున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ క్రమంలో సరస్వతి ఎలుకల మందు తిని ఆత్మహత్యకు ప్రయత్నించింది.

బూచేపల్లి వెంకాయమ్మను సత్కరించిన ఎమ్మెల్యే


బూచేపల్లి వెంకాయమ్మను శాలువాతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు గురువారం చీమకుర్తిలోని వెంకాయమ్మ నివాసరంలో మర్యాద పూర్వకంగా కలిశారు. శాసన సభ ప్రివిలేజ్ కమిటీ సభ్యునిగా ఎమ్మెల్యేను నియమించటంతో బూచేపల్లి వెంకాయమ్మను ఎమ్మెల్యే టీజేఆర్ కలుసుకొని పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, పార్టీ నాయకురాలు సన్నపురెడ్డి రమణమ్మ ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

ప్రతి ఇంటికీ నంబరు తప్పనిసరి

- త్వరలో నంబరు ప్లేటు అంటించే కార్యక్రమం
- నగర కమిషనర్ వెంకటేశ్వరరావు


32వ డివిజన్‌లో ఇంటింటికీ నంబర్లు వేయిస్తున్న దృశ్యం

ఒంగోలు సబర్బన్: నగరంలో ప్రతి ఇంటికీ నంబరు తప్పకుండా ఉండాలని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. 32వ డివిజన్‌లో ఇంటింటికీ నంబరు వేసే కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి ఇంటికీ వారికి కేటాయించిన నూతన ఇంటి నంబరును మార్కర్ పెన్నుతో వేయించారు. తరువాత ప్రతి ఇంటికి శాశ్వతంగా కొత్త నంబరుతో ప్లేట్లు అంటించే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. శాశ్వత ఇంటి నంబర్ల కోసం ఇప్పటికే టెండర్లను ఆహ్వానించామన్నారు. ఇంటి నంబర్లు రాయటానికి కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. అందుకుగాను సచివాలయాల పరిధిలో ఈ నెల 28వ తేదీ లోపు ఇంటింటికీ నంబర్లు రాసే కార్యక్రమం పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. అదుకుగాను సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు, ఎమినిటీ సెక్రటరీతో పాటు మున్సిపల్ ఇంజనీరింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నగరంలోని పారిశుద్ధ్య పనులను కమిషనర్ పర్యవేక్షించారు. ఈ మేరకు నగరంలోని కొప్పోలు, రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మ కాలనీ, ఎన్టీఆర్ కాలనీతో పరిసర కాలనీల్లో రోజువారీ జరుగుతున్న పనులు జరుగుతున్న తీరును గమనించారు. గుత్తికొండ వారి పాలెంలోని చెత్త డంపింగ్ యార్డును పరిశీలించిన కమిషనర్ అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్లు, సిబ్బంది, వినియోగదారులు

ఒంగోలు సబర్బన్: బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో గురువారం ఒంగోలు నగరంలో వినియోగదారుల అవగాహనా ర్యాలీ నిర్వహించారు. నెల్లూరు బస్టాండ్ నుంచి ప్రారంభమై ట్రంక్ రోడ్డు, పాత మార్కెట్, అద్దంకి బస్టాండ్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, పవర్ ఆఫీస్ మీదుగా కర్నూలు రోడ్డు ఫ్లై ఓవర్ వరకు సాగింది. సీనియర్ బ్రాంచ్ మేనేజర్ టీ.వర ప్రసాదు మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు గుర్తింపు పొందిన బ్యాంక్ ఆఫ్ బరోడా 116వ వార్షికోత్సవం జరుపుకుంటున్నామన్నారు. బెలూన్లు ఎగురవేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంఎస్ఎంఈ చీఫ మేనేజర్ ఎం.సుబ్రహ్మణ్యం, ఎన్‌జీఓ కాలనీ బ్రాంచ్ మేనేజర్ ఏ.నవీన్, బ్యాంకు ఖాతాదారులు ఎన్.నాగేశ్వరరావు, కల్యాణ్ చక్రవర్తితో పాటు బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

క్లాప్ యూజర్ చార్జీ వాసూళ్లలో అలసత్వం తగదు


సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలో ఆసించిన మేర క్లాప్ యూజర్ చార్జీలు వసూలు చేయటం లేదని అధికారులు, సిబ్బందిపై ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తన చాంబర్‌లో గురువారం నగర పాలక సంస్థ నోడల్ ఆఫీసర్లు, శానిటేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేవలం క్లాప్ యూజర్ ఫీజు కలెక్షన్ల కోసం ఒంగోలు నగరంలో 26 మంది నోడల్ ఆఫీసర్లను నియమించామన్నారు. నగరంలోని 70 వార్డు సచివాలయాల పరిధిలో ప్రతి రెండు, మూడు సచివాలయాలకు ఒకరి చొప్పున మొత్తం 26 మందిని నియమించటం జరిగిందన్నారు. అయితే అనుకున్నంతగా క్లాప్ యూజర్ ఫీజు వసూలు కావటం లేదని వెల్లడించారు. ప్రతి రోజూ రూ. 2 లక్షలు వసూలు కావాల్సి ఉంటే అందులో సగం కూడా కావడం లేదని మండిపడ్డారు. ఇక నుంచి అయినా ప్రతి నోడల్ ఆఫీసర్ వారికి కేటాయించిన సచివాలయాల పరిధ/ లో సాధారణ విధులతో పాటు యూజర్ చార్జీల వసూళ్ళు కూడా విధిగా చేపట్టాలని ఆదేశించారు. ప్రతి రోజూ రీజనల్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్‌కు నివేదిక ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అసిస్టెంట్ కమిషనర్ వీరాంజనేయులు, నగర పాలక సంస్థ ఎంహెచ్‌ఓ మనోహర్ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ ఎస్.పిచ్చయ్య, ఎంఈ కె. మాల్యాద్రి, నోడల్ ఆఫీసర్లు, శానిటరీ మేస్త్రీలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



ధర్నా చేస్తున్న మున్సిపల్ వర్కర్స్

చీమకుర్తి: మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని గురువారం చీమకుర్తిలో మున్సిపల్ వర్కర్‌లు సీఐటీయూ జెండాలు చేతబట్టి తమ నిరసనలు చేపట్టారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కోవిడ్ కాలంలో పనిచేసిన కార్మికులకు ఉద్యోగ భద్రతను కల్పించాలని డిమాండ్ చేశారు. అత్యాల యోహాను, అల్లడి కోటేశ్వరరావు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

వర్షంతో హర్షం


ఆశాజనకంగా రొయ్యల చెరువు


వర్షం కురవడంతో ఆరోగ్యంగా ఉన్న చామదుంప


వర్షంతో కళకళలాడుతున్న వేరుశనగ పైరు

కొత్తపట్నం: ఇటీవల రుతుపవనాలు ప్రభావంతో కురిసిన వర్షాలకు మండల పరిధిలోని పైర్లు కళకళలాడుతున్నాయి. మొన్నటి వరకు ఎండు ముఖం పట్టిన పంటలు ఇప్పుడు పచ్చదనంతో పరవళ్లు తొక్కుతున్నాయి. ఈ నెల 4న , 9న భారీ వర్షం కురవడం, ప్రతి రోజూ చిరుజల్లులు కురుస్తుండటంతో పూత దశలో ఉన్న పైరు పుంజుకుంది. ఖరీఫ్ సీజన్‌కు వేరుశనగ ఇ– క్రాప్ లెక్కన 400 ఎకరాలు, ఇ– క్రాప్ చేయకుండా 250 ఎకరాలు, చామ 75 ఎకరాలు, ఆకుకూరలు, కూరకాయలు 400 ఎకరాల్లో సాగుబడి చేస్తున్నారు. 600 ఎకరాల్లో దుక్కిలు దున్ని సిద్ధం చేసుకున్నారు. అదేవిధంగా రొయ్యల సాగు 2 వేల ఎకరాల మేర సాగుబడి చేస్తున్నారు. నీటిలో ఉప్పు శాతం పెరిగి గత నెలలో పెరుగుదల నిలిచిపోయింది. ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉన్నందున మేత తీసుకోక చనిపోతున్నాయి. కానీ ఈ వర్షం ఎంతో ఉపయోగపడింది. కొంత మంది రైతులు ఉప్పుశాతం తగ్గే సరికి చెరువుల్లో రొయ్య పిల్ల వదలటానికి పంపింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్టెప్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన


విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న స్టెప్ సీఈవో ఎంవీఎస్ లోకేశ్వరరావు

ఒంగోలు: స్టెప్ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై గురువారం స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ సమితిలో అవగాహన సదస్సు జరిగింది. స్టెప్ సీఈవో ఎంవీఎస్ లోకేశ్వరరావు మాట్లాడుతూ మంచి, చెడు, అనుకూల, వ్యతిరేక భావాలను క్రోడీకరించుకుని వారి జీవితంలో ఏది అనుకూలతో నిర్ధారించుకోవాలన్నారు. జవహర్ నవోదయ విద్యాలయ సమితి ప్రిన్సిపాల్ ఎం.సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, అప్పుడే వారు తమ లక్ష్యాలను చేరుకోగలరన్నారు. ఇప్పటి నుంచి ప్రయత్నం చేయాలని విద్యార్థులకు సందేశం ఇచ్చారు. రీసోర్సు పర్సన్ షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ పదో తరగతి మార్కులు ఎంత అవసరమో విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ, యువజన సంక్షేమశాఖ సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస పుస్తకాలను పంపిణీ చేశారు.